23న బాలనర్సింహ స్వామి కల్యాణం

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల,మే 19 ః ఈ నెల 22 నుంచి నిర్వహించే చిట్యాలలోని బాలనర్సింహస్వామి కల్యాణోత్సవాలు జయప్రదం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బాలనర్సింహ స్వామి ఉత్సవాల కరపత్రాలను ఆదివారం ఆయన నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. ఉత్సవాల్లో భక్తులు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కాకులారపు బొర్రారెడ్డి, నాయకులు పోకల దేవదాసు, జడల చినమల్లయ్య, మారగోని ఆంజనేయులు, జిట్ట చంద్రకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎస్‌పీ శివరాంరెడ్డి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివరాంరెడ్డి

చిట్యాల, మే 19 :విద్యార్థులు ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభకు పదును పెట్టాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గుండ్రాంపల్లి గ్రంథాలయం సమాచార కేంద్రం ఆధ్వర్యంలో 24 రోజులుగా నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండ్రాంపల్లిలో యువకులు 19యేండ్లుగా గ్రంథాలయాన్ని నిర్వహించడంతోపాటు ఇలాంటి శిక్షణ శిబిరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. శిబిరంలో చిత్రలేఖనం, బేసిక్ తెలుగు, ఇంగ్లీషు, గణితంపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయం చైర్మన్ అనముల శ్రీనివాసు వివరించారు. చిత్రలేఖనం చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శివరాంరెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గాదె వినోదరెడ్డిలు బహుమతులు అందజేశారు. మన గ్రంథాలయం మన కానుక కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన అచ్చిన లింగస్వామి తన కూతురు మహిత పుట్టిన రోజు సందర్భంగా రూ.1000 గ్రంథాలయ అభివృద్ధి కోసం అందజేశాడు. ఈ కార్యక్రమంలో దుబ్బ కుమార్, గ్రంథాలయ వ్యవస్థాపక సభ్యుడు వెల్లంకి లక్ష్మణాచారి, గరిషె అంజయ్య , పంతంగి శ్రీకాంత్, గోపగోని శ్రీనివాసు, ఆనంద్, బొడిగె అంజయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి మహా యజ్ఞం

మహా యజ్ఞంలో పాల్గొన్న మహిళలు

కట్టంగూర్, మే 19 : మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి మహా యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, కనకదుర్గమ్మ, లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలు, శివలింగాలకు పంచామృతం అభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసః శర్మ, రామడుగు అశ్విని కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో యాగకృతును జరిపించారు. కార్యక్రమంలో తాడిశెట్టి గీత, కంచర్ల రజిని, ఇల్లెందుల మణేమ్మ, బండారు నాగమ్మ, గుండు రూప, ఇల్లెందు రాజ్యం, అరుణ్‌కుమార్, ఓరుగంటి రమేశ్, కోమటి భాస్కర్, సందీప్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు కృష్ణయ్యకు నివాళి

దేవరకొండ రూరల్, మే 19 : మండలంలోని తూర్పపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నూనె కృష్ణయ్య ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాగవరం ప్రభాకర్ రావు, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్ పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీటీసీ జెల్ల రజితారేణు గౌడ్, జనార్దన్ రావు, గోపాలల్, బొడ్డుపల్లి అంతయ్య, రామేశ్వర్‌రావు, ఆంజీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

దుగ్యాలలో వైద్య శిబిరం

పెద్దఅడిశర్లపల్లి, మే 19 : మండలంలోని దుగ్యాల గ్రామంలో రివర్ నిమ్స్, సూర్య హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు పాల్వాయి వెంకట్‌రెడ్డి 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సందర్భంగా గ్రామస్తులు వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నారబోయిన నారయణ,అడేపు నర్సింహ్మ, గిరి, యాదగిరి పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ

రామగిరి, మే 19: ఎంజీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ లక్ష్మీప్రభ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్వహకులకు పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. వేసవి దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పరీక్షల్లో తప్పులు జరిగే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

అక్రమంగా డబ్బుల వసూళ్లు చేసిన వారిపై వారిపై కేసు

కొండమల్లేపల్లి, మే 19 : పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు కంటైనర్లు, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న కొందరు యువకులు, విలేకరులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 18వ తేదీ రాత్రి సమయంలో శ్రీకాకుళం ప్రాంతం నుంచి సమారు రూ.2కోట్ల విలువ చేసే పశు సంపదను 30 కంటైనర్లలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అయితే కొండమల్లేపల్లిలో కొందరు యువకులు, విలేకరులు(నమస్తే తెలంగాణ కాదు) కంటైనర్ల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. దాంతో పది మందిపై కొండ మల్లేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రశ్నించే వాళ్లకు మద్దతివ్వండి

- ఎమ్మెల్సీగా అవకాశమిస్తే మండలిలో గ్రాడ్యుయేట్ల కోసం గొంతెత్తుతా
- కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి విస్మరించింది
- బ్లాక్ మెయిలర్స్, మోసగాళ్లకు అవకాశమిస్తే అన్యాయం జరుగుతది
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి, పక్కన జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మే 19 : ప్రభుత్వ పెద్దలకు తొత్తులుగా మారి వారిని ప్రశంసించే వాళ్లను కాకుండా ప్రశ్నించే తన లాంటి వారికి అవకాశమివ్వాలని నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో గ్రాడ్యుయేట్ల గొంతుకగా ప్రశ్నిస్తానని తెలిపారు. నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల, అవుట్ డోర్, ఇండోర్ స్టేడియంలో ఆదివారం వాకర్స్‌ను కలిసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇయ్యలేదని, దీనిపై కాంగ్రెస్ అభ్యర్థి ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1.68 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు 3.5 లక్షల నుంచి 9లక్షల ఐటీ ఉద్యోగాలకు పెంచినట్లు తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్, నోటిఫికేషన్లు, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాను బిట్స్ పిలానీలో చదివి అమెరికాలో ఉండి వచ్చానని, సంపాదించిన సొమ్ము పేద విద్యార్థుల చదువు కోసం వినియోగిస్తున్నానని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వచ్చే గౌరవ వేతనంతో నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ ఇప్పించడంతోపాటు వచ్చిన నిధులు సైతం లైబ్రరీల నిర్మాణం కోసం వినియోగిస్తానన్నారు.

కేసీఆర్ మాట విజన్ కోసమే

తాను కేసీఆర్ మాట, విజన్ కోసం ఎమ్మెల్సీగా బరిలో నిలిచానని, ఆయన సూచనకు అనుగుణంగా ముందుకు సాగుతానని తెలిపారు. తాను రైతు బిడ్డనని, రైతులకు రైతు బంధు అడిగితే చెప్పుతో కొట్టమని అన్నవాళ్లకు ఆ రైతులు, రైతు బిడ్డలు ఎందుకు ఓటు వేయాలో చెప్పాలన్నారు. రైతుల ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టిన కాంగ్రెస్ వాళ్లకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జీఓ 46 ద్వారా కొంత మందికి అన్యాయం జరిగినట్లు గుర్తించిన గత ప్రభుత్వం.. ఆ జీఓను సరి చేసే ముందే ఎన్నికల కోడ్ వచ్చినందున వీలు పడలేదన్నారు. ఆ జీఓను రద్దు చేస్తామని చెప్పిన రేవంత్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జర్నలిజాన్ని ఎర్నలిజంగా మార్చి రంగులు మార్చే ఊసరవెల్లులు ఎన్నికల్లోకి వస్తున్నాయని, వాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. గతంలో ఎంతో మంది మేధావులకు పట్టం కట్టిన విద్యావంతులు ఈ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక ఎవరో.. ప్రశంసిస్తూ మోసం చేసే వారు ఎవరో గుర్తించి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ గెలిస్తే గ్రాడ్యుయేట్ల గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదని ఆరోపించారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయమన్నారు. గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహారం గమనించి బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి అవకాశమిస్తే మండలిలో వారి సమస్యలపై గొంతెత్తుడన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, కొండూరు సత్యనారాయణ, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న రాకేశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

నల్లగొండలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

రామగిరి, మే 19 : సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నల్లగొండలోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య ఆశయసాధనకు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నారి ఐలయ్య, సయ్యద్ హశం, పుచ్చకాల నర్సిరెడ్డి, పాలడుగు నాగార్జున, ఎండీ సలీం, పాలడుగు ప్రభావతి, దండెంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

■ మిర్యాలగూడ : పట్టణంలోని ఈదులగూడ చౌరస్తాలో సుందరయ్య విగ్రహానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దబ్బికార్ మల్లేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా ఈదులగూడెం వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వీరెపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, బావండ్ల పాండు, రెమడాల పరుశరామ్, పాల్గొన్నారు.

■ కట్టంగూర్ : కట్టంగూర్ ఎన్ఆర్ భవనంలో సీపీఎం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెంజర్ల సైదులు, మాద సైదులు, కట్ట బక్కయ్య, జాల రమేశ్, ముస్కు రవీందర్ పాల్గొన్నారు.

■ నార్కట్‌పల్లి : మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళుల అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి చెరుకుపెద్దులు, చింతపల్లి బయ్యన్న పాల్గొన్నారు.

■ చిట్యాల : చిట్యాల, చిన్నకాపర్తి గ్రామాల్లో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి , పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య పాల్గొన్నారు. వెలిమినేడుతో బొంతల చంద్రారెడ్డి, మల్లం మహేశ్, అరూరి శ్రీను, ఎంపీటీసీ దేశబోయిన స్వరూప పాల్గొన్నారు.

■ హాలియా హాలియాలో ప్రజా సంఘాల నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, నాయకులు కత్తి శ్రీనివాసరెడ్డి, కారంపూడి ధనమ్మ తదితరులున్నారు.

21న హాలియాలో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం

హాలియా, మే 19 : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఎన్నికల నాగార్జున సాగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశం ఈ నెల 21న హాలియా లక్ష్మీనర్సింహాగార్డెన్‌లో మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ హాలియా పట్టణాధ్యక్షుడు వడ్డే సతీశ్ రెడ్డి ఆదివారం తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, రాకేశ్‌రెడ్డి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రాడ్యుయేట్స్ ఓటర్స్, బీఆర్ఎస్ అభిమానులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ మాడ్గులపల్లి మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య

మాడ్గులపల్లి, మే 19: ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, విద్యావంతుడు ఏనుగుల రాకేశ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అన్యాయాలను, అక్రమాలను, విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు రాకేశ్‌రెడ్డి కృషి చేస్తారని అన్నారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాకేష్‌రెడ్డి ని శాసనమండలికి పంపించాలని కోరారు.

ఆసిఫ్‌నెహర్ కాల్వ పరిశీలన

శాలిగౌరారం: తక్కెళ్లపహాడ్‌లో కాల్వ పనులను పరిశీలిస్తున్న నాయకులు

శాలిగౌరారం, మే 19 : మండలంలోని డ్రై ఏరియా గ్రామాలైన బైరవునిబండ, తక్కెళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలకు సాగు నీరందించే ఆసిఫ్ నెహర్ కాల్వ పనులను కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేసి రైతుల సాగు భూములకు సాగు నీరందించాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, షేక్ ఇంతియాజ్, నోముల జనార్దన్, బండపెల్లి కొమరయ్యగౌడ్, సురేందర్ రెడ్డి, భూపతి అంజయ్యగౌడ్, మల్లయ్య, చింత ధనుంజయ్య, నర్సింహ, జానయ్య, నరేశ్, రమేశ్, గణేశ్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 11 మందికి గాయాలు

చిట్యాల : ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

మిర్యాలగూడ, మే 19 : రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన పట్టణంలోని నందిపాడు బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది.. టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా తుఫ్రాన్‌పేటకు చెందిన మెగావత్ బోజ్యా కుటుంబసభ్యులతో కలిసి టాటా ఏస్‌లో దామరచర్ల మండలం కల్లెపల్లిలో గల మైసమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. మొక్కులు చెల్లించుకొని తిరిగి వెళ్తుండగా నందిపాడు బైపాస్ రోడ్డు వద్ద క్రాసింగ్ స్పీడ్ బ్రేకులు ఉండడంతో వాహనం నెమ్మదిగా వెళ్తున్నది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ వాహనం వేగంగా టాటాఏస్‌ను ఢీకొనడంతో ముందుకు పడిపోయింది. ప్రమాదంలో వాహనంలో ఉన్న మెగావత్ బోజ్యా, పూర్ణ, చరణ్, అనూష, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటినా గాయపడిన వారందరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కొ ని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలేరో ట్రాలీని లారీ ఢీ కొట్టడంతో నలుగురికి..

చిట్యాల : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. సంఘటనకు సంబంధించి ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఓ బొలేరో ట్రాలీ ఫ్లై ఉడ్ లోడ్‌తో నెల్లూరు వెళ్తున్నది. ఆ వాహనం చిట్యాలలోని ఆటోనగర్‌లో గల ఓ హోటల్ వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న ట్రాలీ లారీ సడన్ బ్రేక్ వేసి హోటల్ వైపు మళ్లడంతో బొలేరో ట్రాలీ లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బొలేరోలోని డ్రైవర్ ఎస్ఆర్ బాబుతో పాటు అందులో ప్రయాణిస్తున్న కార్పెంట్ వర్కర్లు బిహార్‌కు చెందిన రాహుల్ కుమార్, చందన్‌కుమార్, మనీశ్ తీవ్ర గాయపడి వాహనంలోనే ఇరుక్కున్నారు. అదే సమయంలో పక్కనే హోటల్‌లో భోజనం చేస్తున్న చిట్యాల కానిస్టేబుళ్లు సాయికుమార్, ఖలీమ్ సంఘటన స్థలానికి చేరుకొని వాహనంలో ఇరుక్కున్న వారిని స్థానిక మెకానిక్, ప్రజల సాయంతో బయటకు తీశారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసుకొని పోలీస్‌స్టేషన్, అంబులెన్స్ వాహనాలకు సమాచారం ఇచ్చారు. బాధితులను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

కరిష్మా

నిడమనూరు, మే 19 : మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ జానిమియా కుమార్తె కరిష్మా (23) గ్రామంలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నది. శనివారం సాయంత్రం గ్రామంలో స్నేహితురాలి జన్మదిన వేడుకకు వెళ్లి వస్తానంటూ ఇంట్లో నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆమె కోసం వెతికారు. ఆమె తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం బంధువులను ఆరా తీశారు. ఆచూకీ ఎంతకూ లభించకపోవడంతో యువతి తల్లి అనిఫా ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్.ఐ. గోపాల్ రావు తెలిపారు.

గూడ్స్ వాహన డ్రైవర్ దారుణ హత్య

కట్టంగూర్, మే 19 : మండలంలోని ఎరసానిగూడెం స్టేజి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఓ గూడ్స్ వాహన డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఎస్ఐ ఎన్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం .. కృష్ణా జిల్లా పామర్రు మండలం చెట్లవారిపురం గ్రామానికి చెందిన కొల్లూరి రాజవర్ధన్(35) గూడ్స్ వాహనంలో ఇంటి సామగ్రి వేసుకొని విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి అన్‌లోడ్ చేసి తిరిగి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యంలో ఎరసానిగూడెం స్టేజి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాజవర్ధన్‌ను తీవ్రంగా గాయపరిచి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి హత్య చేసి రోడ్డు పక్కన పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. అనంతరం సంఘటన స్థలాన్ని డీఎస్పీ కే. శివరాంరెడ్డి సందర్శించి హత్య విషయాన్ని పోలీసులకు అడిగి తెలుసుకున్నారు.

కనగల్ బ్రిడ్జి కింద వ్యక్తి మృతదేహం

నల్లగొండ సిటీ , మే 19 : కనగల్ మండల కేంద్రంలోని బ్రిడ్జి కింద ఆదివారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిడ్జి కింద మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సమీపంలో బ్యాగులో లభించడంతో ఆధార్ కార్డు దొరకడంతో మృతుడు సముద్రాల కృష్ణ(50),న్యాగుండ్లపల్లి,యాదగిరిగుట్ట మండలం అన్ని గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని డీఎస్పీ పరిశీలించారు

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు అరుణ్

చందంపేట(నేరేడుగొమ్ము), మే 19 : మండలంలోని వైజాక్ కాలనీ పరిధిలోని బుగ్గతండాలో ఆదివారం వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. బుగ్గతండాకు చెందిన వాంకుణావత్ గేద(కుమార్), శిల్ప దంపతులు వైజాక్ కాలనీలో సాగర్ వెనుక జలాల్లో చేపల వేట కోసం వెళ్లారు. వెనుక జలాల ఒడ్డున తల్లిదండ్రుల కోసం వేచి ఉన్న గేద కుమారుడు అరుణ్‌పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో గాయాలపాలైన బాలుడు అరుణ్‌ను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నసర్లపల్లి వాసికి పీహెచ్‌డీ

పట్టా అందుకుంటున్న మల్లికార్జున

చింతపల్లి, మే 19 : చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామానికి చెందిన చెట్టుపల్లి మల్లికార్జున్ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ రాంరె